# అన్నదాతలకు సర్కారు ధోకా

- అన్ని రకాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నది..
- రైతులకు రైతుభరోసా ఇయ్యలే, రుణమాఫీ చెయ్యలే
- బోనస్ బోగస్.. ధాన్యం కొనుగోళ్లు చెయ్యకపాయె
- పత్తి పంట కొనకపాయె, మక్క కేంద్రాలు లేకపాయె
- మాజీ మంత్రి హరీశ్ ఆగ్రహం



*కేసీఆర్ పాలనలో దుక్కి దున్నినప్పటి నుంచి పంట కొనుగోళ్ల దాకా రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటే, రాజకీయ విషక్రీడలో, తిట్ల పురాణాల్లో మునిగి తేలుతున్న కాంగ్రెస్ పాలనలో రైతులు దిక్కులేని పక్షులై దీనంగా చూస్తున్నరు. ఇకనైనా హైడ్రాలు, మూసీలు, ఫోర్త్ సిటీ డంభాచారాలను కొంచెం పక్కనపెట్టి పంట కొనుగోళ్ల మీద, మద్దతు ధర మీద, ఇస్తామన్న బోనస్ మీద దృష్టి పెట్టండి. - హరీశ్‌రావు*

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర రైతాంగాన్ని అన్ని విధాలా మోసం చేస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. రైతులకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక రేవంత్‌రెడ్డి సర్కారు.. ఒక్క హామీని కూడా సక్రమంగా అమలుచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రైతులకు రుణమాఫీ కాలేదు.. రైతుబంధు అందలేదు.. పంటలకు బోనస్ బోగస్ అయింది. కనీసం పంటల కొనుగోళ్లు చేపట్టలేకపోయింది.. రాష్ట్రంలో ఎక్కడా పత్తి, మక్కల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయలేదు' అని ఫైరయ్యారు. కాంగ్రెస్ పాలన తెలంగాణ రైతులకు శాపంగా పరిణమించిందని మంగళవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. 'తెలంగాణలో 44.5 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పత్తి సాగు జరిగిందని అధికారిక అంచనాలు ఉన్నయి. రాష్ట్ర వ్యాప్తంగా 322 సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల ప్రారంభించినట్టు ఆర్భాటంగా ప్రకటించింద్రు. ఆచరణలో ఇప్పటి వరకు ఒక్క రైతు దగ్గర కూడా పత్తి కొనుగోలు చేసిన పాపాన పోలేదు. కాంగ్రెస్ ప్రకటించిన వరంగల్ రైతు డిక్లరేషన్ ప్రకారం, పత్తి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521 తోపాటు రూ.500 బోనస్ కలిపి రూ.8,021కి కొనుగోలు చేయాలి. ప్రభుత్వం కొనకపోవడం వల్ల రైతులు వ్యాపారులకు రూ.ఐదు వేలకే అమ్ముకొనే దుస్థితి వచ్చింది. అకాల వర్షాల వల్ల దిగుబడి తగ్గిపోయి ఎకరానికి నాలుగు క్వింటాళ్ల పత్తి కూడా పండలేదు. గోరు చుట్టుపై రోకటి పోటులా.. దిగుబడి తగ్గడంతోపాటు తక్కువ ధరకు అమ్ముకొని పత్తి రైతులు దారుణంగా నష్టపోతున్నారు. ఇది పూర్తిగా రేవంత్ సర్కారు వైఫల్యం. మక్కల పరిస్థితి మరీ దారుణం. మక్కల కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటి వరకు ఉత్తర్వులు కూడా జారీ చేయలేదు. మక్కకు మద్దతు ధర రూ.2,225 ఉంటే కాంగ్రెస్ ఇస్తానన్న బోనస్ కలిపి రైతుకు క్వింటాల్‌కు రూ.2,725 ధర లభించాలి. కానీ, ప్రభుత్వం ఇంకా కొనుగోలు కేంద్రాలే పెట్టకపోవడంతో దిక్కుతోచని మక్క రైతులు రూ.2 వేలకే అమ్ముకొని లబోదిబోమంటున్నరు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### పది కిలోల సన్నాలు కూడా కొనలే

రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా సన్న బియ్యం పట్టుమని పదికిలోలు కొన్న దాఖలాల్లేని హరీశ్‌రావు దుయ్యబట్టారు. 'వరి కొనుగోలు కేంద్రాలకు గన్నీ బ్యాగులు రాలేదు. ఏ ఊరు ధాన్యం ఏ మిల్లుకు పోవాల్నో ఒప్పందం జరుగలేదు. ధాన్యం రవాణా ఏర్పాట్లకు కూడా దిక్కులేదు. ప్రభుత్వం కట్టాలని చెప్పిన ఎర్రరంగు సుతిలి దారం గాని, పచ్చరంగు సుతిలి దారం గాని కొనుగోలు కేంద్రాలకు చేరిన దాఖలాల్లేవు. వరి పండించిన రైతుల పరిస్థితి ఎట్లున్నదంటే.. అంగట్లో అవ్వ అంటే ఎవనికి పుట్టినవ్ బిడ్డా.. అన్నట్టున్నది. బోనస్ మాట దేవుడెరుగు.. కనీసం మద్దతు ధర కూడా లభించని దౌర్భాగ్య పరిస్థితి.. వడ్ల మద్దతు ధర రూ.2,320 ఉంటే ప్రభుత్వం కొనకపోవడంతో రైతులు రూ.1800-1900కే అడ్డికి పావుశేరు లెక్కన అమ్ముకొని కన్నీటి పర్యంతమవుతున్నరు' అని ఆవేదన వ్యక్తంచేశారు.

### కేసీఆర్ పాలనలో రైతులకు రందిలేదు

పదేండ్ల కేసీఆర్ పాలనలో రైతులు రంది లేకుండా బతికారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పది నెలల కాలంలోనే రైతుల కష్టానికి ఫలితం దక్కక అలమటించేలా చేశారని మండిపడ్డారు. పంట పెట్టుబడి కోసం ఇవ్వాల్సిన పైసలు ఎగ్గొట్టి ఇప్పటికే రైతుల నెత్తిన శఠగోపం పెట్టారని విమర్శించారు. 'ఇప్పుడు కొనుగోళ్లు కూడా చేయకుండా రైతుల ఉసురు తీయొద్దని ఈ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం' అని పేర్కొన్నారు.

*కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో వరి ధాన్యానికి 500 బోనస్ ఇస్తామని మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన తర్వాత సన్న రకాలకు మాత్రమే ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కారు. ఇప్పుడు అటు సన్నాలకు, ఇటు దొడ్డు రకాలకు బోనస్ మాట అటుంచి మద్దతు ధర కూడా లభించని దౌర్భాగ్య స్థితిలోకి రైతులను నెట్టేశారు. రాష్ట్రంలో ఎక్కడా సన్నబియ్యం పట్టుమని పది కిలోలు కూడా కొన్న దాఖలాల్లేవు. మా ప్రభుత్వం ఉన్నప్పుడు నిరుడు ఈ రోజుకు 8 లక్షల 63 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసింది. ఇప్పుడు రేవంత్ సర్కారు ఇప్పటివరకు కేవలం 10-15 వేల మెట్రిక్ టన్నులకు మించి కొనలేదు. అంటే గతంలో మేము కొనుగోలు చేసిన ధాన్యంతో పోలిస్తే కేవలం 2 శాతం ధాన్యమే కొన్నారు.*

*-మాజీ మంత్రి హరీశ్ రావు*

## అడవి బిడ్డల ఘీంకారం కుమ్రంభీం: హరీశ్

**అడవి** బిడ్డల ఘీంకార స్వరం కుమ్రంభీం అని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదివాసీల పోరాటయోధుడు కుమ్రంభీం జయంతి సందర్భంగా మంగళవారం ఎక్స్ వేదికగా హరీశ్ నివాళులర్పించారు. 'అడవి బిడ్డల ఘీంకార స్వరం.. ఆదివాసుల స్వయం ప్రతిపత్తే ధ్యేయంగా ఎగిసిన ఉద్యమ బావుటా.. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే జల్ జంగల్ జమీన్ నినాదంతో పోరు తలపెట్టిన యోధుడు కుమ్రంభీం. ఆయన జయంతి సందర్భంగా ఘన నివాళులు' అని పేర్కొన్నారు.



## కుమ్రంభీం స్ఫూర్తితోనే స్వరాష్ట్ర పోరు

- ఆయన ఆశయాల సాధనే ఎజెండాగా బీఆర్ఎస్ పాలన
- జయంతినాడు కుమ్రం భీంను స్మరించుకున్న కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): అస్తిత్వ పోరాటానికి ప్రతీక అయిన కుమ్రంభీం స్ఫూర్తితోనే నాడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమం సాగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. మంగళవారం కుమ్రంభీం జయంతి సందర్భంగా ఆయన పోరాట పటిమను ఎక్స్ వేదికగా స్మరించుకున్నారు. ఆయన 'జల్, జంగల్, జమీన్ అని నినదించిన పోరాటయోధుడని, గోండు బెబ్బులిగా ప్రజలు పిలుచుకున్నారని కొనియాడారు. బడుగు బలహీనవర్గాల హక్కుల సాధనకు, ఆదివాసీ అస్తిత్వ పోరాటానికి ఆయన పెట్టిన పేరు అని పేర్కొన్నారు. ఆ మహనీయుడి ఆశయాల సాధనే ఎజెండాగా తొలి, మలి తెలంగాణ ప్రభుత్వాల్లో ప్రగతి ప్రస్థానం జరిగిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఆసిఫాబాద్ జిల్లాకు కుమ్రంభీం పేరు పెట్టుకున్నందుకు, జోడేఘాట్ లో సుందరమైన ఆయన స్మృతివనాన్ని ఏర్పాటు చేసినందుకు గర్విస్తున్నామని పేర్కొన్నారు.

## శిరోముండనం చేయించిన ఎస్సై బదిలీ

లింగాల, అక్టోబర్ 22: ముగ్గురు యువకులకు శిరోముండనం చేయించిన ఘటనలో ఎస్సైపై బదిలీ వేటు పడింది. ఈ మేరకు అచ్చంపేట సీఐ రవీందర్ మంగళవారం వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు ఈ నెల 13న పెట్రోల్ బంక్ నిర్వాహకులపై దాడి చేశారు. 14న బంక్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు యువకులను పోలీసులు స్టేషన్‌కు రప్పించి వేధింపులకు గురి చేశారు. లింగాల ఎస్సై జగన్‌మోహన్ సమక్షంలో వారికి గుండు గీయించడంతోపాటు మూడు రోజులపాటు స్టేషన్‌లోనే పెట్టి పనులు చేయించారు. దీంతో గోపిశెట్టి వినీత్ అవమానకరంగా భావించి ఈ నెల 18న ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు రావడంతో ఎస్సైని బదిలీ చేస్తూ మంగళవారం ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

## పీఎస్‌లో దళితులపై ఎస్సై దాడి!

కేటీదొడ్డి, అక్టోబర్ 22: ఇద్దరు దళిత యువకులపై ఓ ఎస్సై పోలీస్ స్టేషన్‌లో దాడిచేసి వేధింపులకు గురిచేశారు. దీంతో బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ ఘటన మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకుంది. కేటీదొడ్డి మండలం చింతలకుంటకు చెందిన జములమ్మ ఖాళీ స్థలంలో బండలు పాతడంతో తన ఇంటికెళ్లే దారి మూసుకుపోయిందని బాధితుడు బ్యాగరి నాగప్ప తెలిపాడు. ఈ విషయంలో తమ ఇద్దరి మధ్య గొడవ తలెత్తగా.. దాడి చేశారంటూ కేటీదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో జములమ్మ ఫిర్యాదు చేసిందని, ఆమె ఫిర్యాదు మేరకు తనతోపాటు తన తమ్ముడు బ్యాగరి నర్సింహులును ఎస్సై శ్రీనివాసులు పీఎస్‌కు పిలిపించి అసభ్య పదజాలంతో దూషించారని వాపోయాడు. గదిలోకి తీసుకెళ్లి గంటన్నరపాటు కొట్టారని, దుర్భాషలాడుతూ హింసించి సంతకం పెట్టించుకున్నారని ఆవేదన చెందాడు. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు బాధితులు తెలిపారు. ఫిర్యాదు మేరకు నాగప్పపై కేసు నమోదు చేశామని, కొట్టలేదని ఎస్సై వివరణ ఇచ్చారు.

## సొంత వైద్యం వికటించి యువతి మృతి

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 22:భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కారల్ మార్క్స్ కాలనీకి చెందిన అంజలి(20) వంద పడకల దవాఖానలో నర్స్ ట్రైనింగ్ చేస్తున్నది. సోమవారం అనారోగ్యానికి గురికావడంతో తానే స్వయంగా సెలైన్ బాటిల్ పెట్టుకున్నది. దీంతో కొద్దిసేపటికే వాంతులు చేసుకొని శ్వాస ఆడటం లేదని చెప్పడంతో ఆమెను వరంగల్ ఎంజీఎం దవాఖానకు 108లో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది.



## కుమ్రంభీం స్ఫూర్తితోనే గిరిజనులకు రిజర్వేషన్లు

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): కుమ్రంభీం స్వరాజ్య పాలన నినాద స్ఫూర్తితోనే సీఎంగా కేసీఆర్ నాడు గిరిజన రిజర్వేషన్లను 10 శాతానికి పెంచారని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి గుర్తుచేశారు. కుమ్రంభీం పేరుతో ఆసిఫాబాద్ జిల్లాను ఏర్పాటుచేశారని చెప్పారు. కుమ్రంభీం జయంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్ తెలంగాణభవన్‌లో ఆయన చిత్రపటానికినేతలు పుష్పాంజలి ఘటించారు. బీఆర్ఎస్ నేతలు దేవీప్రసాద్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, దూదిమెట్ల బాలరాజుయాదవ్, గోవర్ధన్, బాలు, కిశోర్‌గౌడ్, రఘురామ్, రామచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.



మెదక్ జిల్లా ఔరంగాబాద్‌లో తడిసిన వడ్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనాలి

- దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలి: పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట/మెదక్ రూరల్, అక్టోబర్ 22 : అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని కొనాలని, వరి పంట దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మెదక్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్, చిన్నశంకరంపేట మండలాల్లో ఆమె పర్యటించారు. సూరారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం భాగీర్థిపల్లిలో నిర్వహించిన రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం చందంపేట సహకార సంఘం చైర్మన్ సత్యనారాయణ కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. మెదక్ మండలం ఔరంగాబాద్, ఔరంగాబాద్ తండా అవుసలపల్లిలో తడిసిన ధాన్యం రాశులను పరిశీలించారు. అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని కొర్రీలు పెట్టకుండా కొనుగోలు చేయాలని పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేయకపోతే రైతుల తరఫున పోరాడుతామని హెచ్చరించారు. అనేక హామీలిచ్చిన కాంగ్రెస్.. రైతులను నిలువుగా మోసం చేసిందని ఆరోపించారు.



వనపర్తి నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

## 29న వనపర్తిలో రైతు సమరభేరి

**సదస్సుకు హాజరుకానున్న హరీశ్‌రావు.. నిరంజన్‌రెడ్డి వెల్లడి**

వనపర్తి, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ) : రైతులను నిట్టనిలువునా ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటానికి కొనసాగిస్తామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 29న రైతులతో సమరభేరి మోగిస్తామని పేర్కొన్నారు. మంగళవారం ఆయన వనపర్తి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలుచేయకుండా సంక్షేమ పథకాలను పక్కదారి పట్టించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. రుణమాఫీని పూర్తి చేయకపోవడంతోపాటు రైతుభరోసా ఎగవేస్తూ తీవ్ర అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. వనపర్తిలో నిర్వహించనున్న సమరభేరి సదస్సుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. సమావేశం జరుగుతుండగానే హరీశ్‌రావు.. నిరంజన్‌రెడ్డికి ఫోన్ చేశారు. రేవంత్‌రెడ్డి మెడలు వంచి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలయ్యేలా సదస్సు నిర్వహించుకుందామని స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో మీడియా సమావేశంలో ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి దీక్ష చేసిన ఫొటోలను చూపిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

## నిర్వాసితులపై కాంగ్రెస్‌ది కపటప్రేమ

- పరిహారం పంపిణీపై రేవంత్‌కు చిత్తశుద్ధి లేదు
- దమ్ముంటే రూ.12 లక్షల పరిహారం ఇవ్వాలి
- బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబర్ 22: మల్లన్నసాగర్ నిర్వాసితులపై కాంగ్రెస్ నేతలు కపట ప్రేమ చూపుతున్నారని బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాసితులకు ఇచ్చిన రూ.6 లక్షల పరిహారాన్ని రెట్టింపు చేసి రూ.12 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాడు ఏటిగడ్డకిష్టాపూర్‌లో చేసిన నిరాహార దీక్షలో రేవంత్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. మంగళవారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రతాప్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ మేరకు 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం బీఆర్ఎస్ ప్రభుత్వం పరిహారం అందజేసిందని తెలిపారు. అబద్ధపు ప్రచారాలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు రెట్టింపు పరిహారం ఇవ్వడానికి ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నిర్వాసితుల సమస్యలపై ఒక్కసారి కూడా సమీక్ష చేయలేదని, పెండింగ్ నిధులను విడుదల చేయడం లేదని, నిర్వాసిత గ్రామాలను ఏ మాత్రం పట్టించుకోవడం మండిపడ్డారు. కొంతమంది కాంగ్రెస్ పార్టీ దుర్మార్గులు, బ్రోకర్లు మల్లన్నసాగర్ ప్రజలను మభ్యపెడుతూ రాజకీయ లబ్ధి కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కపటప్రేమ చూపిస్తున్నారని దుయ్యబట్టారు. రాజకీయ లబ్ధికోసం వచ్చే కాంగ్రెస్ పార్టీ బ్రోకర్ల ఉచ్చులో ప్రజలు పడొద్దని హితవు పలికారు. 65 ఏండ్లు నిండిన వారికి ప్యాకేజీలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. కొంతమంది కోర్టుకు వెళ్లడంతో ప్యాకేజీలు ఆగాయని, వారికి పరిహారం ఇచ్చేలోపే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. కోర్టు తీర్పును కాంగ్రెస్ ప్రభుత్వం ధిక్కరిస్తున్నదని, మిగిలిన 65 ఏండ్లు నిండిన వారికి వెంటనే ప్యాకేజీలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజల పక్షాన నిలబడుతుందని, వారి పక్షాన పోరాడుతుందన్నారు.

## పిడుగుపాటుకు ముగ్గురు బలి

**ఖమ్మం జిల్లా కామేపల్లిలో తండ్రీకూతురు**

**కామారెడ్డి జిల్లాలో యువరైతు దుర్మరణం**

కారేపల్లి (కామేపల్లి)/నాగిరెడ్డిపేట, అక్టోబర్ 22: రెండు వేర్వేరు జిల్లాల్లో మంగళవారం పిడుగులు పడి ముగ్గురు మృతి చెందారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం అడవిమద్దులపల్లికి చెందిన చింతల లింగస్వామి (50), ఆయన భార్య శైలజ, కూతురు కావేరి(18) కలిసి చేనులో పత్తి తీస్తుండగా మధ్యాహ్నం భారీ వర్షంతోపాటు పాటు పిడుగుపడింది. దీంతో లింగస్వామి, కావేరి అక్కడికక్కడే మృతిచెందారు. శైలజకు తీవ్ర గాయాలుకాగా సమీప రైతులు దవాఖానకు తరలించారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం బొల్లారంలో మంద నాగభూషణం తన కుమారుడు వెంకటేశ్‌తో కలిసి తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతుండగా వర్షం కురిసింది. తండ్రీకొడుకుతోపాటు మరో మహిళ కాశవ్వ పక్కనే ఉన్న వేపచెట్టు కిందకు వెళ్లగా, పిడుగుపడి వెంకటేశ్ (26) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలైన నాగభూషణం, కాశవ్వను గ్రామస్తులు ఎల్లారెడ్డిలోని దవాఖానకు తరలించారు.

## మృత్యు పిడుగులు

- ఆరు నెలల్లో రాష్ట్రంలో 47మంది దుర్మరణం
- అత్యధికంగా మే-జూన్‌లలో 35 మంది మృతి
- సెప్టెంబర్ 25న ఒక్కరోజే ఐదుగురు బలి

*ప్రకృతి వైపరీత్యాల్లో భాగమైన పిడుగులు మనుషులు, జీవాల ప్రాణాలను బలిగొంటున్నాయి. వర్షాలతోపాటు పడుతున్న పిడుగులు రెప్పపాటులో ఆయువు తీస్తున్నాయి.*

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పిడుగులు ప్రాణాలు తీస్తున్నాయి. ఆరు నెలల్లోనే 47మంది పిడుగుపాటుకు మృతిచెందినట్టు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది మే 10 నుంచి జూన్ 10లోపు పిడుగుపాటుకు 35 మంది చనిపోయినట్టు సమాచారం. కాగా, సెప్టెంబర్ 25న కురిసిన వర్షాలకు పలు జిల్లాల్లో ఐదుగురు దుర్మరణం చెందారు. ఈ నెల 2న ఉమ్మడి వరంగల్ జిల్లాలో పిడుగులతో ముగ్గురి మృతి చెందగా, 6న హన్మకొండ జిల్లా ఐనవోలులో ఇద్దరు రైతులు చనిపోయారు. 15న సూర్యాపేట జిల్లాలో నడిగూడెంలో పిడుగుపాటుకు మహిళ మృతి చెందగా.. 19న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు చోట్ల 44జీవాలు మృత్యువాతపడ్డాయి. 20న సిద్దిపేట జిల్లా దుబ్బాకలో పిడుగుపడి ఓ మహిళ మృతి చెందింది. ఈ సీజన్‌లో సహజంగా తుపాన్లు, భారీ వర్షాలు, వరదలు, గాలిదుమారాలు తదితర ప్రకృతి విపత్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా ఉరుములు, మెరుపుల సమయంలో బయటికి రావొద్దని కోరుతున్నారు. రైతులు, కూలీలు వర్షాలొచ్చే వేళ సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని పేర్కొంటున్నారు. చెట్ల కిందకు, టవర్ల కిందకు వెళ్లొద్దని, సెల్‌ఫోన్, ఎఫ్‌ఎం రేడియో, ఎలక్ట్రానిక్ పరికరాలు వాడొద్దని హెచ్చరిస్తున్నారు.

